క్లుప్తంగా

పార్వతీపురం తహసీల్దార్‌గా జయలక్ష్మి



తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన జయలక్ష్మి

పార్వతీపురం టౌన్: పార్వతీపురం తహసీల్దార్‌గా వై.జయలక్ష్మి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె ఇప్పటి వరకు శ్రీకాకుళం జిల్లాలో తహసీల్దార్‌గా విధులు నిర్వహించారు. ఇప్పటి వరకు ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసిన సోమేశ్వరరావు శ్రీకాకుళం జిల్లా నందిగాంకు బదిలీపై వెళ్లారు. ఈమెకు డిప్యూటీ తహసీల్దార్ కిరీటి, ఆర్ఐ రామకృష్ణ అభినందనలు తెలిపారు.

ఎంపీడీఓగా త్రివిక్రమరావు



మాట్లాడుతున్న ఎంపీడీఓ త్రివిక్రమరావు

సీతానగరం: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పి.త్రివిక్రమరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల సహకారంతో గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు ప్రభుత్వ పథకాలను అర్హులైన వారికీ అందేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు. మండల పరిషత్ సిబ్బంది ఎంపీడీఓకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

ఆర్టీసీ ద్వారా ప్రయాణికులకు మరిన్ని సేవలు



నూతన ఆర్టీసీ బస్సులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం టౌన్: ఆర్టీసీ ద్వారా ప్రజలకు మరిన్ని సేవలందించాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. ఈ మేరకు శుక్రవారం పార్వతీపురం ఆర్టీసీ డిపో పరిధిలో నూతన బస్సులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెలకు ఆర్టీసీ సేవలు మరింతగా విస్తరించేందుకు ప్రణాళికా బద్ధంగా వెళ్లాలని సూచించారు. ఆర్టీసీ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఫారెస్ట్ రేంజ్ అధికారిగా రామ్‌నరేష్



ఫారెస్టు అధికారి మనోజ్‌కుమార్‌ను కలిసిన ఫారెస్ట్ రేంజ్ అధికారి రామ్‌నరేష్

పార్వతీపురం టౌన్: పార్వతీపురం ఫారెస్ట్ రేంజ్ అధికారిగా బిర్లంగి రామ్‌నరేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఫారెస్టు అధికారి మనోజ్‌కుమార్‌ను కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇప్పటి వరకు ఆయన విశాఖపట్టణం ఫారెస్టు రేంజ్ అధికారిగా విధులు నిర్వహించారు.

బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓ



బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓ స్వరూపరాణి

మక్కువ: ఎంపీడీఓగా డి.స్వరూపరాణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఎంపీడీఓగా విధులు నిర్వహించిన సి.హెచ్. సూర్యనారాయణ వేపాడ మండలం ఎంపీడీఓగా బదిలీపై వెళ్లగా, ఆ స్థానంలో స్వరూపరాణి బాధ్యతలు చేపట్టారు. ఆమెకు పంచాయతీ కార్యదర్శులు, మండల ప్రజా పరిషత్ సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

ఏయూ బోర్డు ఆఫ్ స్టడీస్ మెంబర్‌గా చిరంజీవులు



డా.చిరంజీవులు

సాలూరు: ఆంధ్రా విశ్వ విద్యాలయం ఆర్థిక శాస్త్రం విభాగం బోర్డు ఆఫ్ స్టడీస్ మెంబర్‌గా పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్థశాస్త్ర విభాగం అధ్యాపకుడు డాక్టర్ కె.చిరంజీవులు నియామకం అయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీను శుక్రవారం తెలిపారు. ఏయూ పరిధిలోని డిగ్రీ విద్యార్థులకు పాఠ్యాంశాలు నిర్ణయించడంలో బోర్డు ఆఫ్ స్టడీస్ సభ్యుడు కీలకంగా పని చేస్తారని తెలిపారు. ఆయనను ప్రిన్సిపాల్, తోటి అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

ఉచిత ఇసుక..
హామీ నెరవేర్చకపోవడంపై ఆందోళన



పార్వతీపురం పట్టణంలో భారీ ర్యాలీలో పాల్గొన్న సీపీఎం నేతలు, భవన నిర్మాణ కార్మికులు, ట్రాక్టర్ల యజమానులు

- భవన నిర్మాణ రంగం, ట్రాక్టర్ కార్మికులకు ఉపాధి కల్పించాలి
- సీపీఎం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

పార్వతీపురం టౌన్/పార్వతీపురం:

ప్రభుత్వం ఉచిత ఇసుక హామీని తక్షణం అమలు చేయాలని భవన నిర్మాణ కార్మికులు, ట్రాక్టర్ల యజమానులు, కూలీలు సీపీఎం ఆధ్వర్యంలో కదం తొక్కారు. ఉచిత ఇసుక దక్కకపోవడంతో నిర్మాణ రంగం కుదేలవుతుందని, ఉపాధి కోల్పోతున్నామని వారు నినదించారు. తక్షణమే ఆ హామీని అమలు చేయాలని కోరుతూ పార్వతీపురం పాత బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు రెడ్డి వేణు మాట్లాడుతూ ప్రభుత్వం ఉచిత ఇసుక హామీ ఇచ్చి మాట తప్పిందన్నారు. వంద రోజుల పాలనలో ఇసుక విషయంలో భవన నిర్మాణ కార్మికులను మోసం చేసిందన్నారు. ఇసుక రీచ్‌లు జిల్లాకు 115 కిలోమీటర్ల దూరంలో భామిని మండలం కాట్రగడ్డలో ఉందని, దీన్ని రవాణా చేయాలంటే మోయలేని ఆర్థిక భారం అవుతుందన్నారు. ప్రభుత్వం ఉచిత హామీ అమలు చేయకపోవడం వల్ల ఇసుక లభించడం లేదన్నారు. రవాణా చార్జీలు, ఇతర పేర్లు చెప్పి ఇసుక రేట్లు తగ్గించలేదన్నారు. జిల్లాలో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా కొనసాగుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నేతలు పలుచోట్ల ఇసుకపై పెత్తనం చెలాయిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి, సీఐటీయూ కోశాధికారి గొర్లి వెంకటరమణ, బంటు దాసు, సూరిబాబు, గంధి దిలీప్‌కుమార్, కిల్లాడ నాగేశ్వరరావు, అశోక్‌కుమార్, ప్రదీప్, శివ, చిరంజీవి, సత్తిబాబు, ప్రసాదు, జానీ, శంకర్ దాలియా తదితర కార్మికులు పాల్గొన్నారు.



ఇన్‌చార్జి డీఆర్‌ఓ కేశవనాయుడుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న సీపీఎం నేతలు, ట్రాక్టర్ యజమానులు

చిన్నారుల కోసం బాలవికాస కేంద్రాలు

సాలూరు రూరల్: చిన్నారుల మనోవికాసం కోసమే శ్రీ సరస్వతీ విద్యాపీఠం ఆధ్వర్యంలో బాలవికాస కేంద్రాలను నిర్వహిస్తున్నామని సరస్వతీ విద్యాపీఠం ప్రాంత కార్యదర్శి జగదీష్ అన్నారు. మామిడిపల్లిలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ కేంద్రంలో శుక్రవారం జరిగిన గిరిజన గ్రామాల్లో నడుపుతున్న సంస్కార కేంద్రాల వలంటీర్ల ఒక్కరోజు శిక్షణా తరగతుల కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ సరస్వతీ బాల వికాస కేంద్రాల ద్వారా చిన్నారులకు భారత దేశ ఔన్నత్యంతో పాటు మహాపురుషుల జీవిత గాథలను చెబుతూ సమాజానికి ఉత్తమ పౌరులను అందించడమే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో విజయనగరం విభాగ్ కార్యదర్శి బాలి విశ్వేశ్వరరావు, జిల్లా సేవా ప్రముఖ్ పొట్నూరు రమణ, బాల వికాస కేంద్రాల పరిశీలకులు గొట్టాపు శ్రీనివాసరావు, మామిడిపల్లి శిశుమందిర్ ప్రధాన ఆచార్యులు గౌరినాయుడు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విద్యాపీఠం కార్యదర్శి జగదీష్

పెదపదం ఆరోగ్య కేంద్రానికి శంకుస్థాపన

సాలూరు రూరల్: మండలంలోని పెదపదం గ్రామంలో రూ.55లక్షల వ్యయంతో ఆరోగ్య కేంద్ర నిర్మాణానికి స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి శుక్రవారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 40 ఆరోగ్య ఉపకేంద్రాలు భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేశారన్నారు. అందులో భాగంగా పార్వతీపురం జిల్లాకు 8 భవనాలు మంజూరు కాగా అందులో సాలూరు నియోజకవర్గానికి 4 భవనాలు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డి సుకన్య, ఐటీడీఏ అధికారులు పాల్గొన్నారు.



ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరించిన మంత్రి సంధ్యారాణి

మద్యం షాపుల్లో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించాలి

సాలూరు: రాష్ట్రంలో 3,650 మద్యం షాపులకు దరఖాస్తులు ఆహ్వానించిన టీడీపీ కూటమి ప్రభుత్వం దుకాణాల కేటాయింపులో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా స్టేట్ సెక్రటరీ గొంప ప్రకాశరావు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎస్సీలకు 14 శాతం, ఎస్టీలకు 6 శాతం మద్యం షాపులను కేటాయించాలని కోరారు. గిరిజన ప్రాంతాల్లో షాపులను గిరిజనులకే కేటాయించాలని కోరారు. ఈ రిజర్వేషన్‌లపై ఎస్టీ, ఎస్సీ ఎమ్మెల్యేలు ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వంలో ఉద్యోగాలు ఎలాగు లేవని, కనీసం ఈ మద్యం దుకాణాల్లోనైనా రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్లు లేకుండా లాటరీ పద్ధతిలో కేటాయిస్తే, రాష్ట్ర హైకోర్టులో రిట్ పిటిషన్ వేస్తామని పేర్కొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం పెట్రోల్ బంకు సమీపంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు వాయుపుత్ర సేవా సంఘం ప్రతినిధులు బోటు అనిల్‌కుమార్, స్వాతి, గెంబలి ప్రదీప్‌కుమార్, నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రక్తదానం చేసి ప్రాణదానం కావాలని వారు పిలుపునిచ్చారు.

పశుబీమాకు ఆదరణ కరువు

- ఆసక్తి చూపని పాడి రైతులు
- నియోజకవర్గంలో 21వేలకు పైగా పాడి పశువులు

పార్వతీపురం టౌన్:

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పాడి పశువులకు బీమా అందజేస్తున్నాయి. ఈ బీమా ప్రీమియం మూడేళ్లకు రూ.2 వేలు. ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ.800, రాష్ట్ర ప్రభుత్వం రూ.800 చెల్లిస్తాయి. మిగిలిన రూ.400 రైతులు చెల్లించాలి. అదే గొర్రెలు లేదా మేకకు అయితే కేవలం రూ.20 కడితే మిగిలిన రూ.80 కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా చెల్లిస్తాయి. ఒకటి లేదా రెండు పశువులు ఉన్న రైతులు బీమా కడుతున్నారు. కానీ ఎక్కువ పాడి పశువులు ఉన్న రైతులు ఒక్కసారిగా అంత మొత్తం చెల్లించలేక బీమా కట్టడానికి ముందుకు రావడం లేదు. దీంతో పశువుల బీమాకు ఆదరణ కరువైంది. పార్వతీపురం నియోజకవర్గంలో 21 వేలకు పైగా పాడి పశువులు ఉన్నాయి. వాటిలో ఇప్పటి వరకు కేవలం 2504 మంది మాత్రమే బీమా చేయించుకున్నారు.



మూగజీవాలు(ఫైల్)

• పశు జాతిని అనుసరించి బీమా

ఏదైనా ప్రమాదం వలన జంతువు మరణిస్తే దేశవాళీ, సంకర జాతి పశువులకు రూ.30వేలు బీమా, నాటు జాతికి చెందిన పశువులకు రూ.15 వేలు, గొర్రె, మేకలకు రూ.6 వేలు వరకు బీమా వస్తుంది. అయితే చాలా మంది రైతులు బీమా చెల్లించకపోవడంతో ప్రమాదవశాత్తు పశువు మరణించినా ఒక్క రూపాయి కూడా రావడం లేదు. ఆ సమయాల్లో రైతులు నాయకులతో సిఫారసు చేయించినా, అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం ఉండదు. కనుక ప్రతి పశువుకు బీమా చేయించాల్సి ఉంటుంది. ముఖ్యంగా వరద బాధిత గ్రామాల రైతులకు బీమా అవసరం ఎక్కువగా ఉంటుంది. ప్రతి ఏడాది వరదలు వస్తున్న తరుణంలో విషసర్పాలు, వరదల వలన పశువులకు ప్రాణ నష్టం జరిగే అవకాశాలు ఎక్కువ. ఈ నేపథ్యంలో వరద బాధిత గ్రామాల రైతులు తప్పనిసరిగా ప్రతి పశువుకు బీమా చేయడం ఉత్తమం.

• మార్గదర్శకాలు

బీమా చేయించేటప్పుడు రైతు ఆధార్ కార్డు, తెల్లరేషన్ కార్డు అందించాలి. పాడి పశువులకు బీమా చేసే క్రమంలో ట్యాగ్ వేస్తారు. ప్రమాదవశాత్తు పశువు మరణిస్తే వెంటనే సమీపంలోని సిబ్బందికి సమాచారం ఇవ్వాలి. ఒకవేళ బీమా చేయించిన పశువును విక్రయిస్తే పశువును కొనుగోలు చేసిన వ్యక్తి ఏడు రోజుల్లో బీమా కంపెనీ ప్రతినిధులకు సమాచారం ఇచ్చి తన పేరు మీద బీమా మార్చుకోవాలి.

నియోజకవర్గంలో బీమా నమోదు ఇలా..

మండలం	గేదెలు	ఆవులు	మేకలు	గొర్రెలు	మొత్తం
బలిజిపేట	18	739	13	06	776
పార్వతీపురం	67	468	54	31	620
సీతానగరం	72	1036	--	--	1108
మొత్తం	157	2243	67	37	2504

బీమాతో ప్రయోజనం



రైతులు కేవలం 20 శాతం బీమా కడితే మిగిలిన 80 శాతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీమా చెల్లిస్తాయి. ఈ విధంగా దేశవాళీ, సంకర జాతి పశువులకు రూ.400, నాటు జాతికి చెందిన పశువులకు రూ.200, గొర్రె, మేకకు రూ.20 బీమా చెల్లిస్తే సరిపోతుంది. రైతులంతా తప్పకుండా తమ పశువులకు బీమా చేయించుకోవాలి.

– డాక్టర్ శ్రీనివాస్, ఏడీ, పశుసంవర్ధక శాఖ, పార్వతీపురం

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

సీతానగరం: రాష్ట్ర ప్రభుత్వానికి రైతు సంక్షేమమే ప్రధానమని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. మండలంలోని పెదంకలాంలో నిర్మించిన రైతు భరోసా(సేవ) కేంద్రాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అన్ని విధాల అండగా ఉంటుందన్నారు. జిరాయితీ భూములున్న రైతుల పేర్లతో పాటు కౌలు రైతుల చిరునామాలను విధిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉండేలా వ్యవసాయ శాఖ సిబ్బంది దృష్టి సారించాలని సూచించారు. ఏఓ ఎస్.అవినాష్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతుల అవసరాలకు అనుగుణంగా యంత్ర పరికరాలు, ఎరువులు, విత్తనాల కొరత లేకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈకేవైసీ పనులు ముందుగానే ప్రారంభించడంతో పాటు వేగవంతం చేశామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.శ్రీనివాసరావు, పలువురు సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



రైతుభరోసా(సేవ) కేంద్ర భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర



బలిజిపేట: అజ్జాడలో విజయదుర్గా భవానీ ఆలయంలో పూజలు అందుకుంటున్న అమ్మవారు



పార్వతీపురం టౌన్: కొత్తవలస దుర్గాలయంలో గాయత్రీ దేవి అవతారంలో అమ్మవారు



పార్వతీపురం టౌన్: వైకేఎం కాలనీ దుర్గాలయంలో గాయత్రి దేవి అవతారంలో అమ్మవారు

అమ్మలుగన్న అమ్మ దుర్గమ్మ

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గమ్మ రెండో రోజు శుక్రవారం గాయత్రిదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చింది. అమ్మవారికి విశేష పూజలు భక్తులు నిర్వహించారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పలుచోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వాహకులు ఏర్పాటు చేశారు. అమ్మ వారి పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



సాలూరు: కన్యకాపరమేశ్వరి ఆలయంలో చేస్తున్న మణిదీపవర్ణన పూజలు



మక్కువ: గాయత్రి దేవి అలంకరణలో పోలమాంబ అమ్మవారు



పార్వతీపురం: అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



సాలూరు: గాజుల అలంకరణలో దర్శనమిస్తున్న కామాక్షమ్మ తల్లి



బలిజిపేట: బస్టాండు వద్ద పూజలందుకుంటున్న అమ్మవారు

విద్య-వైజ్ఞానిక మహాసభల
కరపత్రాలు విడుదల

సీతానగరం: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ స్థాపించి 80 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 80 వసంతాల వేడుకలు, 20వ రాష్ట్ర విద్యా - వైజ్ఞానిక మహాసభలు ఈ నెల 6, 7, 8 తేదీల్లో విజయనగరం జిల్లాలో జరుగుతాయని ఏపీటీఎఫ్ రాష్ట్రకార్యవర్గ సభ్యులు దాసరి వెంకట నాయుడు తెలిపారు. శుక్రవారం స్థానిక ఎమ్మార్సీ ఆవరణలో ఈ కార్యక్రమాలకు సంబంధించి కరపత్రాలను విడుదల చేశారు. మహాసభల్లో ఏపీటీఎఫ్ సంఘ లక్ష్యాలైన విద్యాప్రగతి, ఉపాధ్యాయ సంక్షేమం, సమాజ శ్రేయస్సు, మహిళా సాధికారిత, పెన్షన్ విధానం, నూతన జాతీయ విద్యా విధానం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై చర్చలు, తీర్మానాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమానికి ఉపాధ్యాయులతో పాటు విద్యావంతులు, నిరుద్యోగులు, విద్యార్థులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్.సత్యంనాయుడు, వెలగాడ రాము, బుడితి రవికుమార్ పాల్గొన్నారు.